# సుందరీకరణ పేరిట ఇళ్లకూల్చివేతకు నిరసన




ధర్నా సందర్భంగా ప్రసంగిస్తున్న కా॥ కె. ఏసు

**విజయవాడ, 8-6-16 :**

రాష్ట్రప్రభుత్వం సుందరీకరణ, రహదార్ల విస్తరణ పేరిట విజయవాడలో పేదల ఇళ్లు కూల్చివేయడాన్ని, స్వరాజ్యమైదానాన్ని విదేశీ కంపెనీకి అప్పగించడాన్ని నిరసిస్తూ గిరిపురం-శిఖామణిసెంటర్‌లో ఏఐఎఫ్‌టియు (న్యూ), ఓపిడిఆర్‌ల ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు.

ఈ ధర్నాలో ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఏసు మాట్లాడుతూ రాజధాని నగరంగా పేర్కొనబడుచున్న విజయవాడలో రహదార్ల విస్తరణ, కరకట్ట వెడల్పు చేయడం పేరిట పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నారన్నారు. రామవరప్పాడు, పాతరాజేశ్వరి పేట, విద్యాధరపురం, స్వర్గపురి కరకట్ట ప్రాంతాల కష్టజీవుల ఇళ్లు కూల్చివేస్తున్నారని, ప్రజలయొక్క మౌలిక సమస్యలు పరిష్కరించకుండా జీవించే హక్కును హరించివేస్తున్నారన్నారు. ప్రజల అవసరాలకు అందుబాటులోవున్న రైతుబజార్‌ను వేరొక ప్రాంతానికి తరలిస్తున్నారని, నగరం నడిబొడ్డున కమ్యూనిటి అవసరాలకు ఉపయోగపడుచున్న స్వరాజ్యమైదానం (పి.డబ్ల్యు.డి. గ్రౌండ్స్)ను చైనాకంపెనీకి కట్టబెడు తూన్నారని, 135 కోట్లతో ఎమ్యూజ్‌మెంట్ పార్కు, షాపింగ్ కాంప్లెక్సు, స్కేటింగ్ వగైరాల నిర్మాణంకొరకు చైనా కంపెనీకి అనుమతి యిచ్చారని, ప్రభుత్వ ప్రజావ్యతిరేక చర్యలపై ఉద్యమించడం ప్రజల హక్కుగా పేర్కొన్నారు.

ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు వి.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రపంచబ్యాంకు కనుసన్నలలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఆర్థిక సంస్కరణలను దూకుడుగా ఆమలుచేస్తున్నాయని, సుందరీకరణ పేరుతో పార్కుల కొరకు, కోట్ల విలువచేసే ప్రభుత్వ భూములను విదేశీ, స్వదేశీ కార్పొరేటు కంపెనీలకు అప్పనంగా కట్టబెడు తున్నారని, దీనికి వ్యతిరేకంగా సమైక్యంగా ఉద్య మించాలని పిలుపునిచ్చారు. స్త్రీవిముక్తి సంఘటన నాయకురాలు శ్రీదేవి, లక్ష్మి; ఇంకా కె. కోటేశ్వరరావు, ఆదిశేషు, దుర్గారావు, గురునాధరావు తదితరులు పాల్గొన్నారు.

oooooo